తీరని బాకీ

వి.వి.యస్. రామదాసు

వెంకటరావు నాంపల్లి స్టేషనుకు వెళ్ళాడు. పూరీపాసెంజరు రైటు టైముకి వస్తోందా_లేటుగా వస్తోందా_అని నోటీసుబోర్డు చూశాడు. నలభై నిమిషాలు లేటు_అని వ్రాసి వున్నది.

పూరీపాసెంజరు ఎన్నోనంబరు ప్లాటుఫారందగ్గర వస్తుందో తెలుసుకుని ఆ ప్లాటుఫారంమీదికి వెళ్ళి, అక్కడ ఖాళీగా ఉన్న బెంచీమీద కూర్చుని జేబులోనుంచి ఒకకాగితం తీసి ఇట్లా చదువుకున్నాడు.

"తాడేపల్లిగూడెం,
6_4_1966.

సోదర టైపిస్టుగారికి నమస్కారములు. మీ పేరు తెలియక యీ విధముగా వ్రాసినందుకు క్షమించండి. మీ ఆఫీసులో నన్ను టైపిస్టుగా వేసినట్లు

మీకు తెలుసు ననుకుంటాను. ఇవ్వాళే నాకు ఆర్డరు అందినది. నేను పూరీ పాసెంజరులో పదవతేదీన బయలుదేరి హైదరాబాదు వస్తున్నాను. నేను ఇంతకు



మునుపు ఎప్పుడూ హైదరాబాదు రాలేదు. నాయందు దయవుంచి స్టేషనుకు రావలసిందని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు
భవదీయుడు,
డి. సుబ్బారావు'

కాగితం మడచి జేబులో పెట్టుకున్నాడు వెంకటరావు.

ఈ సుబ్బారావు తననుగురించి మరికొన్ని వివరాలు యిచ్చి ఉంటే బాగుండేది. అతనిని సులభంగా గుర్తుపట్టడానికి వీలుండేదని వెంకటరావు అనుకున్నాడు.

ఆ ఉత్తరం మూడు రోజులక్రితం వచ్చింది. ఆఫీసులో పనిచేస్తున్న తక్కిన ముగ్గురు టైపిస్టులు ఆ ఉత్తరం తమది కాదని వదిలివేశారు. వెంకటరావు మాత్రం ఆ ఉత్తరం విప్పి చదువుకున్నాడు. మిగతా ముగ్గురు టైపిస్టులకు చూపించాడు.

"ఇత నెవరో భలేవాడండీ. ఇతని కోసం వేరే ఒకరు వెళ్ళడం ఎందుకో? సీదాగా వచ్చేసి ఒకపూటకు ఏదో ఒక హోటలులో బసచేయవచ్చుగదా.మనల్ని చంపడం దేనికి?" అన్నాడు ఒక టైపిస్టు రంగారావు.

"అతని కీనగరం క్రొత్త అని వ్రాశాడు కదా, పాపం..." అని నచ్చ చెప్పబోయాడు వెంకటరావు.

"అయితే నేమండీ. నేరుగా ఆఫీసుకే రావచ్చును కదా" అన్నాడు మరొక టైపిస్టు మాధవరావు.

"రావచ్చు ననుకోండి. అయినా మనతో కలిసి పనిచేయబోయేవాడు వస్తున్నాడు. ఆ మాత్రం స్టేషనుకి వెళ్ళితే మనసొమ్మేం పోతుంది చెప్పండి." అన్నాడు వెంకటరావు.

"మీదంతా ఒక ఛాదస్తం; దయాకరరావు రిటైరై పోయాడంటే అతనితోనే ఛాదస్తం పోయిందనుకున్నాము. కాని అతని గుణాలు కొన్ని మీకు అలవ

డ్డాయి. వెంకటరావుగారూ," అన్నాడు వేరొక ప్లైపిస్టు ఆనందరావు

"ఇంతకూ మీరు ఆ రోజున నాతో స్టేషనుకు వస్తారా, రారా. ఆ సంగతి చెప్పండి," అని అడిగాడు వెంకటరావు.

"మాకు అంతకంటె మంచిపను లున్నాయి. మా కేమీ తీరికలేదు," అని మిగతా యిద్దరివైపూ చూశాడు మాధవ రావు.

"అయినా అత నేమీ నిస్సహాయు లైన స్త్రీ యేం కాదుకదా, మనలాంటి మగాడే; అతని తంటాలు అతను పడ గలడు; మన కెందుకు లెద్దురూ," అన్నాడు రంగారావు.

"అత నే స్త్రీ అయితే మనలో మనం పోటీపడి వెళ్ళేవాళ్ళం. ఎంత ముఖ్య మైన పనులున్నా అవన్నీ వాయిదా పడి పోయేవి ... వాళ్ళతో మనకేం గాని, మీరైనా వస్తారా, ఆనందరావుగారూ?" అని అడిగాడు వెంకటరావు.

"నాకేమీ అభ్యంతరం లేదు గాని ఎల్లుండి కిరసనాయిల్ కోసం ప్రయత్నం చేయాలి, అందుచేత రావడానికి వీలుం డదు," అన్నాడు ఆనందరావు,

వాళ్ళ ప్రమేయం లేకుండానే ఆరోజు వెంకటరావు స్వయంగా నాంపల్లి స్టేషనుకు వెళ్ళాడు.

మూడేళ్ళ క్రితం ఈ ఆఫీసుకి వెంకట రావును బదిలీ చేసినప్పుడు అతడు ఒక ఉత్తరం ముక్కయినా వ్రాయకపోయి నప్పటికీ దయాకరరావు స్టేషనుకు వచ్చి రైల్వే పోర్టరుతో తాను మాట్లాడే పద్ధతిలోనే తాను యీ నగరానికి క్రొత్త వాడని గుర్తించి "మీ పేరు వెంకట రావుగారు కాదూ?'' అని పలకరిం చాడు.

"నా పేరు మీ కెలా తెలుసు? మీ రెవరండీ?" అన్నాడు వెంకటరావు.

"నేను...ఆఫీసులో ప్లైపిస్టుగా పని చేస్తున్నాను. నా పేరు దయాకరరావు. మీ రేమీ మొగమాటం పడకండి. మా యింటికి వచ్చేయండి," అంటూ పోర్ట రుతో చక చకా ఉర్దూలో మాట్లాడి స్టేషను బయటకు వచ్చి, ఒకరిక్షా మలక పేటకు కుదుర్చుకొని అందులో సామాన్లు యెక్కించి, "ముందు మీరు ఎక్కండి, వెంకటరావుగారూ," అని పోర్టరుకు తానే డబ్బు ఇచ్చి రిక్షాలో ఎక్కాడు.

"నేను ఇవ్వాళ వస్తానని మీకు ఎలా తెలుసునండీ, దయాకరరావుగారూ," అని అడిగాడు వెంకటరావు,

"చాలా సులభం, వెంకటరావుగారూ! మీ బదిలీఆర్డరు టైపు చేసినవాడను నేనే. ఇవ్వాళ మీరు జాయను కావడానికి ఆఖరురోజు. ఇంతకుముందు ఏరోజున మీరు వచ్చినా నేను స్టేషనుకు వచ్చే వాడినికాదు. కారణం ఏమిటంటే – మీరు ఫలానా రోజున వచ్చితీరుతారని తెలి యదుకదా. కాని ఈరోజున తప్పకుండా



వస్తారనుకున్నాను. వచ్చారు.'' అన్నాడు దయాకరరావు.

"చాలా థాంక్సండి, దయాకరరావు గారూ! చాలా మంచిపనిచేశారు. మీరే రాకపోతే నేను చాలా ఇబ్బంది పడి పోయేవాడిని," అన్నాడు వెంకటరావు

రిక్షాలో ఉన్నంతసేపూ వెంకటరావు మనసు పరిపరి విధాలుగా పోయింది. ఈ దయాకరరావు ఎందుకింత శ్రద్ధ చూపిస్తున్నాడు? ఆఫీసులో ఎవరికీ పట్టనిది ఇతనికేం పట్టింది? ఇతనికేమైనా పెండ్లీడుకున్న ఆడపిల్లలున్నారా? వెనకటికొకసారి ఒక ఆఫీసుకి బదిలీఅయి వెంకటరావు వెళ్ళినప్పుడు తాను అవివాహితుడననుకుని ఆఫీసులో ఒకాయన- ఆడపిల్లలతండ్రి, తానంటే ఎంతో అభిమానం ప్రకటిస్తూ ఇంటికి తీసుకొని పోయి కాఫీ యిచ్చాడు; చివరకు ప్రసంగవశాత్తు తనకు ఇదివరకే పెళ్ళి అయిపోయిందని తెలియగానే నెమ్మదిగా మానవత్వ ప్రకటన మానివేశాడు. అటువంటి సంఘటన మరొకసారి జరగకూడదనే ఉద్దేశంతో వెంకటరావు, "దయాకరరావుగారూ, సాయంత్రం ఆఫీసు నుండి రాగానే ఏదయినా ఒక చిన్నగది చూసుకోవాలండీ, తరువాత నెమ్మదిగా ఒక ఫ్యామిలీ పోర్షను చూసుకుంటాను, మావాళ్ళను ఎన్నాళ్ళని వాళ్ళ పుట్టింట్లో ఉంచడం; - చెప్పండి.'' అన్నాడు.

"వేరే చిన్నగది ఎందుకండీ నాకు గవర్నమెంటువారు అద్దెకిచ్చిన క్వార్టర్సులో రెండు గదులున్నాయి, అందులో

ఒక గదిలో మా అబ్బాయి చదువుకుంటాడు. ఆ గదిలోనే మీరు కూడా ఉండవచ్చును." అన్నాడు దయాకరరావు.

దయాకరరావు తనచేత వాళ్ళ అబ్బాయికి ఉచితంగా ట్యూషను చెప్పించుకొనవచ్చునని అనుకుంటున్నాడు కాబోలు, అందుకే ఈ సహాయం చేయడం అని శంకించాడు వెంకటరావు. ఉండబట్టలేక "మీ అబ్బాయి ఏమి చదువుకుంటున్నాడండి, దయాకరరావుగారూ?" అని అడిగాడు వెంకటరావు.

"ఇంజనీరింగు ఫైనలియరు చదువుతున్నాడండీ" అన్నాడు దయాకరరావు.

వెంకటరావు సిగ్గుపడ్డాడు. ఇంజనీరింగు విద్యార్థికి తనేం చదువు చెప్పగలడు?

రిక్షా మలకపేటచేరింది. ఎంతో ఆప్యాయంగా దయాకరరావుగారి భార్య కరుణమ్మగారు ఆదరించి అమృతతుల్యమైన భోజనం పెట్టింది.

ఎవరూ స్వార్థరహితంగా ఏ పనీ చేయరని వెంకటరావు అనుభవపూర్వకంగా తెలుసుకున్న విషయం. కాని దానికి భిన్నంగా దయాకరరావు ప్రవర్తిస్తున్నాడంటే అతనికి ఆశ్చర్యం కలిగింది. ఎవరు ఏ సలహా ఇచ్చినప్పటికీ ఆ సలహా వెనుక ఉన్న స్వార్థం పసికట్టడం వెంకటరావుకి ఒక అలవాటయింది.

సింగిల్ రూము దొరకడానికే వెంకటరావుకు పదిరోజులు పట్టింది. ఆ పది రోజులూ దయాకరరావు బలవంతంగా తన ఇంటిలో వెంకటరావుకు భోజనం పెట్టాడు. వాళ్ళ ఇంట్లో ఆదరణను చవిచూసిన వెంకటరావుకి మానవత్వంమీద నమ్మకం మళ్ళీ చిగురించింది.

సింగిల్ రూముకి వెంకటరావు వెళ్ళిన తరువాత ఫ్యామిలీ పోర్షనుకోసం అతనితోబాటు దయాకరరావుకూడా తిరిగాడు. చివరకు ఆయన సహాయం చెయ్యడం వల్లనే ఒకచోట ఒక వాటా అద్దెకు దొరికింది.

"చూడండి వెంకటరావుగారూ, ఫలానా రోజున మంచిది కాబట్టి మీ కుటుంబాన్ని తీసుకురండి. వాళ్ళు వచ్చిన రోజున సామాన్లు మీ ఇంటికి పట్టించుకునివెళ్ళి భోజనానికిమాత్రం మా ఇంటికి వచ్చేయండి. ప్రయాణపు బడలికతో ఏమి తంటాలు పడతారు, పిల్లలతో. మరునాడు పాలూ, కూరగాయలూ, బియ్యం, మిగతా పదార్థాలన్నీ సమకూర్చుకుని ఉంచుకున్న తరువాత మీ ఇంటికి తీసుకొని వెళ్ళవచ్చును." అని సలహా ఇచ్చారు దయాకరరావు. ఆ ప్రకారమే జరిగింది.

అతడు ఇంటికోసం తిరుగుతున్న మొదటినాడే, వెంకటరావుగారూ, ఈ రోజే ఇల్లు కావాలని ఒక దరఖాస్తు పెట్టుకోండి. మా కాలనీలో ఎవరైనా బదిలీఅయి వెళ్ళుతున్నారేమో ఒక కంట కనిపెడతాను. ఎవరైనా బదిలీఅయి ఆ క్వార్టరు మీకు లభిస్తే సంతోషమే.



అలా దొరకనిపక్షంలో ఒక మూడు సంవత్సరాలు ఓపిక పట్టారంటే నేను రిటైరవుతాను. అప్పుడు నా క్వార్టరు మీకు వచ్చేటట్లు ప్రయత్నించేద్దాము.'' అన్నాడు దయాకరరావు. అతడుఅన్నట్లే వేరే ఏ క్వార్టరు ఖాళీ అయినప్పటికినీ వెంకటరావుకి రాలేదు. చివరకు దయాకరరావు రిటైరైన తరువాత ఎంతో ప్రయత్నించేసి తనకు ఆ క్వార్టరు ఇప్పించేటట్లుచేశాడు దయాకరరావు

దయాకరరావు తనకు ఎందుకంత సహాయంచేశాడో అప్పటికీ ఇప్పటికీ వెంకటరావుకి అంతుపట్టలేదు. రిటైరయే దశ వస్తున్నకొలదీ టైపుచేసే ఓపిక తగ్గిపోయి తనచేత అతని పని కూడా చేయించుకోవాలనే ఉద్దేశ్యంతో ఇంత సహాయంచేస్తూ వచ్చాడేమోనని మొదట్లో వెంకటరావు అనుకున్నాడు. కాని దయాకరరావు ఎప్పుడూ తనపని ఎవరిమీదనూ నెట్టలేదు; పైగా గొలుసు కట్టు వ్రాతలను చదవడంలో మిగతా టైపిస్టులకు దయాకరరావు ఎప్పుడూ సహాయం చేసేవాడు.

పోనీ - నెలాఖరువారంలో చేబదులు పుచ్చుకునే ఉద్దేశ్యంతో ఇంతమంచిగా ఉంటున్నాడేమోనని వెంకటరావు అనుకున్నాడు. కాని ఎప్పుడూ దయాకరరావు వెంకటరావుని చేబదులు అడగలేదు. సరికదా - రెండుమూడుసార్లు తాను చేబదులు ఎవర్ని అడుగుదామా అని సతమతమవుతున్న సమయంలో దయాకరరావు, "వెంకటరావుగారూ, ఏమిటి అదో మాదిరిగా ఉన్నారు. ఏమైనా చేబదులు కావాలా ?'' అన్నాడు.

"మరేనండి, దయాకరరావు గారూ. అయినా ఎన్నింటికని మిమ్మల్ని బాధ పెట్టడం చెప్పండి." అన్నాడు వెంకటరావు.

"నాకేం బాధలేదు. నాదగ్గర డబ్బు లేదే, మీకు ఇవ్వడానికనేది – ఒక్కటే నాబాధ." అని దయాకరరావు అంటూ ఉంటే వెంకటరావు ముఖం నిరాశతో వెలవెల పోయింది. అతనిదగ్గర డబ్బు లేనప్పుడు తనెందుకా ప్రస్తావన చేయాలి అని పరమ దయాళువైన దయాకరరావు మీద వెంకటరావుకి చేతకాని చిరాకు వచ్చింది. అది క్షణమాత్రం. దయాకర రావు ఇంకా ఇలా అన్నాడు. "మన ఆఫీసులో వెంగళరావు అని ఒక గుమాస్తా ఉన్నారు. ఆయనను మీకు పరిచయం చేస్తాను. అతడు ఎప్పుడూ ఎవరికీ చేబదులు లేదనడు; అయితే మీకెంతకావాలో దానికి రెట్టింపు అడ గండి. అడిగినదానిలో సగం ఇవ్వడం అతనికి అలవాటు." ఈమాట వినేసరికి వెంకటరావుకి వేసవిలో కూల్ డ్రింక్ త్రాగినంత హాయిగా అనిపించింది. చేబదులు విషయంలో దయాకరరావు చూపించిన మార్గాన్నే వెంకటరావు అనుసరించాడు.

కృతజ్ఞత భారంలో కృంగిపోతున్న వెంకటరావు దయాకరరావుకి ఏవిధముగా సహాయంచేసి బాకీ తీర్చుకుందామా అని ఆలోచించాడు. ఎప్పుడూ తానే దయాకర రావు సహాయాన్ని పొందడం జరిగింది గాని దయాకరరావుకి సహాయంచేసే అవకాశం వెంకటరావుకి కలుగలేదు ఒకనాడు వెంకటరావు, "దయాకరరావు గారూ, ఎప్పుడూ మీరేనాకు సహాయం చేస్తున్నారుగాని నేను మీకు ఏమీ సహాయం చేయలేదు. మీబాకీ ఎలా తీర్చుకోవాలో నాకు తెలియడంలేదు." అన్నాడు.

"పెద్ద పెద్ద మాటలు ఉపయోగించి నన్ను సిగ్గుపరచకండి – వెంకటరావు గారూ. ఇంతకూ నేను చేసినది చాలా స్వల్పం. ఆ స్వల్పకార్యాలు చేయడం లోనే నేను ఆనందాన్ని పొందాను. ఆవిధముగా ప్రతిఫలం నాకు ముట్టింది." అన్నాడు దయాకరరావు.

అలాంటి దయాకరరావు రిటైరయ్యే టప్పుడు ఇచ్చే టీపార్టీవగైరా కార్య క్రమంలో ఎక్కువగా పాల్గొనాలని వెంకటరావు అనుకున్నాడు. కాని దయాకరరావు అభిమానులు ఆఫీసులో చాలమంది ఉండడంవల్ల వెంకటరావుకు ఆభాగ్యం కలుగలేదు.

రిటైరయిన తరువాత కొంచెం ఇబ్బందులలో ఉండవచ్చు కనుక– అంటే అతనికి ఇబ్బందులు కలగాలని కోరడంకాదు కాని–సాధారణంగా ఇబ్బం దులు వస్తాయి కాబట్టి సహాయం చేద్దా మనుకున్నాడు. కాని భగవంతుని దయ వల్ల దయాకరరావు కొడుకు ప్రథమ శ్రేణిలో బి. ఇ. పాసైనాడు. ఈ కథా

కాలంనాటికి ఇంజనీర్లలో నిరుద్యోగ సమస్య లేదు కాబట్టి వెంటనే ఉద్యోగం వచ్చింది. జూనియర్ ఇంజనీరుగా నాగార్జున సాగర్ ప్రాజెక్టువద్ద వేశారు. దయాకరరావు రిటైరయేనాటికే వాళ్ళ అబ్బాయి రెండు సంవత్సరాలనాటి నుంచి ఉద్యోగం చేస్తున్నాడు.

దయాకరరావు రిటైరయిన కారణంగా ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడానికే సర్వీసు కమీషనువారు కేటాయించిన అభ్యర్థుల నుంచి ఎంచి సుబ్బారావును వేశారు.

"యువర్ అటెన్షన్ ప్లీజ్" అని రైల్వే పాసెంజరు లౌడు స్పీకర్‌లో చేసిన ధ్వనితో వెంకటరావు పాత స్మృతులలోనుండి ప్రస్తుత ప్రపంచం లోకి వచ్చాడు.

"దయచేసి వినండి, పూరీనుండి వచ్చు పాసెంజరు ఇంకొక అయిదు నిముషములలో ఒకటవ నంబరు ప్లాటు ఫారం మీదికి వచ్చును." అనే ప్రకటన విన్న వెంకటరావు బెంచీమీదనుంచి లేచి బద్ధకం విరుచుకుని ప్లాటుఫారం మీద అక్కడక్కడ ఉన్న జనం మధ్యనుంచి నడువసాగాడు.

ఇంక రైలుబండి వచ్చేస్తుంది. కాని సుబ్బారావు అనే ఆయన ఎలా ఉంటాడో తెలియకుండా ఏవిధముగా కలుసుకొనడ మని వెంకటరావు ఆలోచిస్తున్నాడు.

ఇంతలో పొగలు చిమ్ముకుంటూ పూరీ పాసెంజరు రానేవచ్చింది. పోర్టర్లు కారేజీల వెంబడి ప్లాటుఫారం మీద పరుగెత్తుతున్నారు. బండి ఆగింది. చాలా కోలాహలంగా ఉంది. ఒక్కొక్క క్యారేజి నుండి ప్రయాణీకులు దిగుతున్నారు. వెంకటరావు ఆనాడు దయాకరరావు ఏమి చేశాడో గుర్తుకు తెచ్చుకున్నాడు. రైల్వే పోర్టరుతో ఎవరు భాష తెలియక తికమక పడుతున్నారా — అని ఒక్కొక్క ప్రయాణీకుడినీ చూశాడు. ఒకచోట ఒక యువకుడు ఒక హోల్డాలూ ఒకపెట్టె చెరొక చేత్తో పట్టుకుని దించుకుని ప్లాటు ఫారం మీద నిలబడి అటూ ఇటూ ఎవరి కోసమో వెదుకుతున్నట్లు చూస్తున్నాడు. అతని దగ్గరకు వెళ్ళాడు వెంకటరావు అతని పెట్టెమీద వ్రాసి ఉన్న పేరు చూశాడు. డి. సుబ్బారావు, తాడేపల్లి గూడెం — అని ఉన్నది. ఎక్కువ శ్రమ పడకుండా ఆమాకీ దొరికినందుకు వెంకటరావు మనస్సులో దేవుడికి నమస్కరించి ఆ యువకునితో, "క్షమించండి. మీపేరు సుబ్బారావుగారు కదా?" అన్నాడు.

మూడేళ్ళక్రితం తాను ఆశ్చర్య పడి నట్లే అతనుకూడా ఆశ్చర్యపడుతూ, "నాపేరు మీకెలా తెలిసింది? నేను వ్రాసిన ఉత్తరం మీకు అందినదా?" అన్నాడు.

"అందింది. రండి — మా ఇంటికి

"పోదాం" అని ఆహ్వానించాడు_ వెంకట రావు.

రిక్షాలో అతని సామాన్లు ఎక్కించి, ముందు సుబ్బారావుని ఎక్కమని, పోర్టరుకు డబ్బులిచ్చి తానుకూడా రిక్షాలో ఎక్కాడు వెంకటరావు. పాపం, రాత్రంతా నిద్రలేదు కాబోలు_ సుబ్బారావు రిక్షాలో కునికిపాట్లు పడ్డాడు.

రిక్షా మలక్‌పేట చేరింది.

స్నానానికి వేడినీళ్ళు ఇచ్చింది వెంకట రావు భార్య పద్మావతమ్మ. ఎంతో ఆదరంతో రుచికరమైన భోజనం పెట్టింది.

భోజనాలయాక వసారాలో చాపమీద వక్కలూ, ఆకులూ సున్నమూ పెట్టింది పద్మావతమ్మ.

వెంకటరావూ, సుబ్బారావూ చాప మీద కూర్చుని తాంబూలం వేసుకుంటు న్నారు. వాళ్ళకు కొంచెం దూరంగా పద్మావతమ్మ నిలబడి ఉంది.

"ఇంక నువ్వు వెళ్ళి భోజనం చెయ్యి. పద్మా," అన్నాడు వెంకటరావు.

"చేస్తాలెండి, మీ కేం కావాలో ఇవ్వాలని నుంచున్నాను. మీరు ఆఫీసుకి వెళ్ళిన తరువాత భోజనం చేస్తాను." అన్నది పద్మావతి.

ఇతరులకు సహాయం చేయడంలో ఎంత ఆనందం ఉన్నదో వెంకటరావు గ్రహించాడు. దయాకరరావు ఎంత ఆనందాన్ని పొందేవాడో వెంకటరావుకి అర్థమయింది. తనకు ఎంతో సహాయం చేసిన దయాకరరావు ఋణం తీర్చుకోడానికి మార్గం కనిపించింది. తానుకూడా ఇతరులకు సహాయం చేయడం ద్వారానే ఆ బాకీ కొంతవరకు తీరుతుందని వెంకటరావుకి నమ్మకం కుదిరింది.

భోజనం చేసి తాంబూలం వేసుకుని స్థిమితపడిన సుబ్బారావుకి హఠాత్తుగా ఒక విషయము గుర్తుకు వచ్చింది. "అస్సలిట్టు అడగడమే మరిచిపోయాను. మీపేరేమిటి మాస్టారూ?" అని వెంకట రావుని అడిగాడు.

"నా పేరు దయాకరరావు" అన్నాడు వెంకటరావు పరధ్యానంగా.

పద్మావతికి నవ్వాపుకోవడం చాలా కష్టమైంది. ఎలాగో నవ్వాపుకొంటూ,

"అదేంటండీ అంత పరధ్యానంగా ఉంటే ఎలాగండీ? మీ పేరు చెప్పక దయాకరరావుగారి పేరుచెబుతారేవండీ?" అన్నది పద్మావతమ్మ.

"సారీ, సుబ్బారావుగారు! నా పేరు వెంకటరావు ..ఇంక ఆఫీసుకి వెళదాం, లేవండి," అన్నాడు వెంకటరావు.